అరసవల్లిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామిని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మతో పాటు పాలకమండలి సభ్యులు మండవల్లి రవి, గోవింద్, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు అనివెట్టి మండపంలో స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు.

రూ.3.71 లక్షల ఆదాయం

అరసవల్లి ఆలయానికి ఆదివారం యాత్రికుల రద్దీ కొనసాగింది. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,26,400, విరాళాల రూపంలో రూ.74,954, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.70 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

పొట్ట దశలో పుట్టెడు శోకం

- ముఖం చాటేసిన వరుణుడు
- ఎండిపోతున్న వరి పంట
- అప్పుల ఊబిలో అన్నదాత

తీవ్ర వర్షాభావ పరిస్థితులు, సాగునీరందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నదాతను నిలువునా ముంచేశాయి. చినుకు రాలక చేను ఎండిపోతూ అన్నదాతలకు పొట్ట దశలో పుట్టెడు శోకం మిగులుస్తోంది. కరువు పరిస్థితుల నేపథ్యంలో కవిటి మండలంలోని కొజ్జిరియా, బెలగాం, శిలగాం, కరాపాడు, రఘునాథపురం, భైరిపురం, రాజపురం తదితర పంచాయతీల్లో 500 ఎకరాలకు పైగా పంటకు నష్టం వాటిల్లింది. దీంతో చేసిన అప్పు తీర్చలేక, ఆదాయం వచ్చే మార్గమే లేక అన్నదాత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు.

ప్రజాశక్తి - కవిటి

కవిటి మండలం భైరిపురానికి చెందిన పుల్లట ప్రసాదరావు ఐదెకరాల్లో వరి నాట్లు వేశారు. ఇందుకోసం అన్ని ఖర్చులు కలుపుకొని రూ.1.18 లక్షలు ఖర్చు చేశారు. నెల రోజులుగా చినుకు రాలకపోవడంతో నాట్లు ఎండిపోయాయి. దీంతో సేద్యం కోసం చేసిన అప్పు ఇప్పుడు ఎలా తీర్చాలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కొజ్జిరియా పంచాయతీకి చెందిన ఉప్పాడ గిరి కొజ్జిరియా, రఘునాథపురం రెవెన్యూ పరిధిలో ఐదెకరాల్లో వరి నాట్లు వేశాడు. ఇందుకోసం రూ.లక్ష ఖర్చు చేసినా నాట్లు ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. కొజ్జిరియాకు చెందిన మరో రైతు సరస్వతి కరాపాడులో రెండు ఎకరాలు, కొజ్జిరియాలో ఎకరాలో వరి నాట్లు వేసింది. ఇప్పటివరకు సుమారు రూ.50 వేలు ఖర్చు చేసిన ఆమె చేను ఎండిపోవడంతో ఉసూరంటోంది. పై పంచాయతీల్లో మిగతా రైతులది ఇదే పరిస్థితి.

ఎండిపోతున్న చేనును చూపిస్తున్న ప్రసాదరావు

చేను ఎండిపోయింది

రెండెకరాల్లో వరి సాగు చేశాను. రూ.30 వేలకు పైగా ఖర్చు చేశాను. వర్షాధార భూములు కావడంతో అడపాదడపా వచ్చిన చినుకులు, స్థానికంగా ఉన్న గుమ్ములు ఉపయోగించుకుని పంట పొట్ట దశ వరకు వచ్చాను. ప్రస్తుతం చేయి దాటిపోయింది. చేను ఎండిపోయింది. ఇప్పుడు దృష్టంతా పంట కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలనే దానిపైనే ఉంది.

- పనపాన ఉమాపతి, రైతు, కొజ్జిరియా

పంట పోయింది... అప్పు మిగిలింది

ఆరుగాలం శ్రమించి పండించిన పంట పోయింది. దాని కోసం చేసిన అప్పు మాత్రం మిగిలింది. నేను 1.50 ఎకరాల్లో వరి వేశాను. ఇప్పటికి రూ.25 వేలు ఖర్చు చేశాను. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ప్రస్తుతం పంట పొట్ట దశలో ఎండిపోతోంది. పంట కోసం చేసిన అప్పు కుంపటిలా మారుతోంది.

- ఉప్పాడ పకీర్ రెడ్డి, రైతు, భైరిపురం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తులసీదాస్ తదితరులు

2న ప్రజా రక్షణ భేరి

- బస్సు యాత్రను జయప్రదం చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజా రక్షణ భేరి బస్సుయాత్రను నవంబరు రెండో తేదీన మందసలో ప్రారంభించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ వెల్లడించారు. సిపిఎం అఖిల భారత నాయకులు విజూ కృష్ణన్ ప్రారంభించే ఈ యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతల్లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యాన కర్నూలు జిల్లా ఆదోని, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో బస్సు యాత్రలు ప్రారంభమై, రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తూ నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు అత్యధిక ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి పాలనలో మొత్తం దేశం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. మత విద్వేషాలు సృష్టిస్తున్న బిజెపి ప్రభుత్వం దేశ సంపదనంతా అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు అంటకాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ప్రధానమైన కృష్ణపట్నం, గంగవరం పోర్టులతో పాటు రాష్ట్ర సంపద అంతా ఒక్కొక్కటిగా అదానీకి కట్టబెడుతున్నా వైసిపి, టిడిపి పల్లెత్తి మాట్లాడటం లేదని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం మేజరు పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, రైల్వేజోన్ వంటి విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన బిజెపి, అంతటితో ఆగకుండా మన రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ వంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి తయారైందని విమర్శించారు. అనంతరం ప్రజా రక్షణ భేరి పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, గంగరాపు సింహాచలం పాల్గొన్నారు.

జిల్లాపరిషత్ సిఇఒగా అప్పారావు

పలువురు రెవెన్యూ అధికారుల బదిలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా భారీగా బదిలీలు చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా జిల్లాలో పలువురు అధికారులకు స్థానచలనం కలిగింది. కోనేరు రంగారావు అమలు కమిటీ డిప్యూటీ కలెక్టర్‌గా విజయనగరం జిల్లాకు చెందిన కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ ఆర్.వి సూర్యనారాయణను జిల్లాకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఆ స్థానంలో పనిచేస్తున్న సుమబాలను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి ఆర్‌డిఒగా పనిచేస్తున్న ఎం.అప్పారావును జిల్లాపరిషత్ సిఇఒగా నియమించారు. కొవ్వాడ ఎస్‌డిసిగా పనిచేస్తున్న పి.మురళీకృష్ణను అల్లూరి సీతారామరాజు జిల్లా కెఆర్ఆర్‌సి ఎస్‌డిసిగా బదిలీ చేశారు. ఎఫ్ఎస్‌సి విభాగంలో ఎస్‌డిసిగా ఉన్న టి.సవరమ్మను సిసిఎల్ఎకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో యలమంచిలి నుంచి కె.జి వేణిని నియమించారు. పలాస ఆర్‌డిఒగా పనిచేసి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న టి.సీతారామ్మూర్తిని విశాఖపట్నం ఆర్‌డిఒగా నియమించారు. శ్రీకాకుళం ఆర్‌డిఒగా పనిచేస్తున్న బొడ్డేపల్లి శాంతిని చీపురుపల్లి ఆర్‌డిఒగా నియమించారు. ఈనెల 27లోగా రిటర్నింగ్ అధికారుల నియామకాలను పూర్తి చేయాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి ఈ బదిలీలు చేపట్టారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

వైసిపి పాలనకు చరమగీతం పాడాలి

- ప్రజల స్వేచ్ఛను హరిస్తున్నారు
- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

శ్రీకాకుళం అర్బన్ : వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మొదలు ఆ పార్టీ ఎమ్మెల్యేల వరకు అరాచకం సాగిస్తున్నారని, పుంగనూరు ఘటనే అందుకు నిదర్శనమన్నారు. ప్రజల స్వేచ్ఛను హరించి నిరంకుశ పాలన సాగిస్తున్నారని, పోలీసులు సైతం వారికి అండగా నిలిచి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ రణస్థలం మండలం నారువకు చెందిన టిడిపి అభిమానులు శ్రీకాకుళం నుంచి కుప్పంకు చేపట్టిన సైకిల్‌యాత్రను మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు చొక్కాలు విప్పి బెదిరించడం హేయమైన చర్య అని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు చిత్తూరు వెళ్లాలంటే వీసా ఏమైనా ఉండాలా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బిసిలను అణగదొక్కాలని ముఖ్యమంత్రి జగన్ చూస్తున్నారని ఆరోపించారు. టిడిపి అభిమానులపై దాష్టీకానికి పాల్పడిన వ్యక్తులకు అండగా నిలుస్తున్నారని ధ్వజమెత్తారు. బిసిలపై దాడి జరిగితే జిల్లాలోని బిసి మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అసాంఘిక కార్యకలాపాలు, దౌర్జన్యాలు జరుగుతుంటే ముఖ్యమంత్రి ఇంతవరకు స్పందించకపోవడం హాస్యాస్పదమన్నారు. ప్రశ్నించే వారిని, ప్రతిపక్షాల నాయకులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ఉత్తరాంధ్రలోని బిసిలందరూ ఏకమై జగన్మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, ప్రదాన విజయరాం, సింతు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాగావళిలో యువకుడు మృతి

మృతుడు ప్రకాశం జిల్లా ఇంజినీరింగ్ విద్యార్థి

ప్రజాశక్తి - బూర్జ

బూర్జ మండలం ఏటొడ్డుపర్త (వై.పర్త) గ్రామానికి సమీపంలోని నాగావళి నదిలో స్నానానికి వెళ్లిన యువకుడు ఆదివారం మృతి చెందాడు. మృతుడు కల్లూరి వెంకట నారాయణ ప్రకాశం జిల్లా పి.సి పల్లి మండలం మర్రికుంటపల్లికి చెందిన వాడు. పోలీసులు, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... వెంకట నారాయణ విజయవాడలోని కెఎల్ యూనివర్సిటీలో బిటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. బూర్జ ఎంపిపి కర్నేన దీప కుమారుడు హేమంత్ అక్కడే విద్యనభ్యసిస్తున్నాడు. దసరా సెలవులకు వెంకట నారాయణ హేమంత్ స్వగ్రామం లక్కుపురానికి ఈనెల 17వ తేదీన వచ్చాడు. నాగావళి నదిలో స్నానం కోసం ఆదివారం వై.పర్తకు వెళ్లారు. స్నానం చేస్తుండగా వెంకట నారాయణ గల్లంతయ్యాడు. దీంతో స్థానికులకు సమాచారం అందించారు. స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి విషయాన్ని చేరవేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నదిలో గాలింపు ప్రక్రియ చేపట్టగా మధ్యాహ్నం మూడు గంటల సమయానికి మృతదేహం లభ్యమైంది. మృతుని తల్లిదండ్రులు జయమ్మ, వెంకటేష్‌కు విషయాన్ని ఫోన్ ద్వారా చెప్పారు. వారు అక్కడ్నుంచి బయలుదేరడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.వి రమణ తెలిపారు.

మృతదేహాన్ని తీసుకొస్తున్న స్థానికులు

అంబేద్కర్ అందరివాడు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

అంబేద్కర్ అందరివాడు అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గాజుల కొల్లివలసలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి అందరికీ సమాన హక్కులను కల్పించారన్నారు. అంబేద్కర్‌ను ఎల్లవేళలా స్మరించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. అంబేద్కర్ నేటితరానికి ఆదర్శప్రాయుడన్నారు. బాల్యం నుంచి వివక్ష ఎదుర్కొంటూ రాజ్యాంగాన్ని రూపొందించే స్థాయికి ఎదిగిన వ్యక్తి అని కొనియాడారు. సమాజంలో అస్పృశ్యతను నివారించడం నుంచి మానవ సమాజాన్ని సమైక్యం చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా విభిన్న పాత్రలు పోషించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ ప్రతినిధి మొండేటి కూర్మారావు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, దళిత నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న స్పీకర్ సీతారాం

ఇంటిగ్రేటెడ్ సైనిక భవన్‌కు 73 సెంట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



జిల్లాలో ఇంటిగ్రేటెడ్ సైనిక భవన్‌కు 73 సెంట్లను ప్రభుత్వం కేటాయించిందని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కటకం పూర్ణచంద్రరావు తెలిపారు. నగరంలోని పెద్ద రెల్లివీధిలోని భవనంలో మాజీ సైనికుల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులకు, వీర మాతలకు మెడికవర్ ఆస్పత్రిలో ఇసిహెచ్ఎస్ ఎన్‌ప్యానల్‌మెంటు అయిందన్నారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎ.శైలజ మాట్లాడుతూ భవనానికి కావాల్సిన తొలివిడత నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. జిల్లాలో అమర జవాను స్మారక స్థానం అన్ని మండల యూనియన్ల సహాయ సహకారాలతో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతినెలా సైన్యం నుంచి ఉద్యోగ విరమణ పొందుతున్న సైనికులను సత్కరించి, వారిని ఫెడరేషన్‌లోకి ఆహ్వానిస్తామని జిల్లా మాజీ సైనికుల సమాఖ్య ఉపాధ్యక్షుడు వి.సూర్యనారాయణ తెలిపారు. సమావేశంలో మాజీ సైనికుల సమాఖ్య ట్రెజరర్ ఐ.ఢిల్లేశ్వరరావు, జిల్లా మాజీ సైనికుల సమాఖ్య చైర్మన్ పి.ఈశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీ పి.మురళీధరరావు, ఫైనాన్షియల్ అడ్వైజర్ ఎ.వి జగన్మోహనరావు, కరస్పాండెంట్ టి.జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన' లేదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రతి సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే స్పందన కార్యక్రమం ఈనెల 23న విజయదశమి సెలవు కారణంగా నిర్వహించడం లేదని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ఎస్‌పి స్పందన కార్యక్రమం కూడా సెలవు నేపథ్యంలో నిర్వహించడం లేదని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

తీరంలో పెరుగుతున్న కొబ్బరి సాగు

- తక్కువ పొడవున్న రకాలపై ఆసక్తి
- గోదావరి జిల్లాల కంటే అధిక దిగుబడి
- ఉద్యాన పంటల సాగుపై మరింత దృష్టి
- ఉద్యానశాఖ అధికారి ఆర్.వి వరప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని సుదీర్ఘ తీర ప్రాంతంలో ఎక్కువ శాతం ఉన్న ఇసుక నేలలు కొబ్బరి సాగుకు అనువైనదని జిల్లా ఉద్యానశాఖ అధికారి రత్నాల వెంకట వరప్రసాద్ అన్నారు. గోదావరి జిల్లాల తర్వాత అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలోనే కొబ్బరి సాగవుతుందని తెలిపారు. తరచూ ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల బారిన పడి కొబ్బరి రైతులకు ఏటా నష్టాలు ఎదురవుతుండడంతో కొత్త వంగడాల కోసం రైతుల నుంచి డిమాండ్ ఉందన్నారు. జిల్లా తీర ప్రాంతంలో వేసే కొబ్బరి ఉత్పాదకత అధికమని చెప్పారు. కొబ్బరి సాగులో మార్పులు అనివార్యం కావడంతో, ఆ దిశగా రైతులకు ఉద్యానశాఖ ద్వారా పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

? జిల్లాలో ఎంతమేర కొబ్బరి సాగవుతోంది?

జిల్లాలో మొత్తం 36,920 ఎకరాల విస్తీర్ణంలో కొబ్బరి పంట విస్తరించి ఉంది. ప్రధానంగా ఉద్దానం ప్రాంతంగా పిలవబడే పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాలతో పాటు సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, పోలాకి, రణస్థలం, గార, శ్రీకాకుళం తీర ప్రాంత మండలాల్లో కొబ్బరి పంట సాగవుతోంది. జిల్లాలో 35,120 మంది రైతులు కొబ్బరి సాగుచేస్తున్నారు. ఏటా 1,753 లక్షల కాయల దిగుబడి వస్తోందని అంచనా. ఈ ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల నుంచి రక్షణకు వీలుగా అనువైన కొబ్బరి రకాలు వేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొబ్బరి సాగును మరింత విస్తీర్ణం పెంచడానికి ఉద్యానవనశాఖ క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటోంది.

? కొబ్బరి సాగుకు అనువైన పరిస్థితులు ఉన్నాయా?

జిల్లాలో కొబ్బరి సాగవుతున్న తీర ప్రాంత మండలాల్లో ఉన్న ఉద్దాన ప్రాంతంలో తేలికపాటి ఇసుక నేలలు వర్షాధారం కావడంతో అనువైనది. తూర్పు కోస్తా పొడుగు రకాలు (ఈస్ట్‌కోస్ట్ టాల్) ఎక్కువగా సాగు చేస్తున్నారు. సాధారణంగా ఈ రకం ఏడేళ్ల లోపు కాపునకు వచ్చి, ఏడాదికి సగటున ఒక చెట్టు 75 నుంచి వంద కాయలు దిగుబడి వస్తుంది. కాయలో 146 గ్రాముల ఎండు కొబ్బరి, 64 శాతం నూనె లభిస్తుందని అంచనా. ఈ ప్రాంతంలో ఏడాదికి సగటు వర్షపాతం వెయ్యి నుంచి 1200 మిల్లీమీటర్లు నమోదు కావడంతో 120 రోజులు వర్షాలు కురవడం, తేమ శాతం అధికంగా ఉంటుంది. అందువల్ల గోదావరి జిల్లాల కంటే కొబ్బరి దిగుబడి ఎక్కువ. ఉద్దానం ప్రాంతంలో పండిన కొబ్బరికి దేశవ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. కాయ సైజు, కాయలోని కొబ్బరి శాతం, నూనె శాతం, కొబ్బరి పెంకు, పీచు నాణ్యత. అన్నిటి కంటే కాయ నిల్వ సమయం ఎక్కువగా ఉండడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లకు రవాణా చేయడానికి, కొబ్బరి పరిశ్రమలకు ముడిసరుకుగా వినియోగించేందుకు వీలవుతుంది.

? కొబ్బరి రైతులకు అందిస్తున్న పథకాలు ఏమిటి?

ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా కొబ్బరి అభివృద్ధి సంస్థ (కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు) సహకారంతో కొబ్బరి సాగును ప్రోత్సహిస్తోంది. కొబ్బరి విస్తరణ పథకం కింద నాణ్యమైన కొబ్బరి మొక్కలు నాటిన రైతులకు ఒక్కో మొక్కకు రూ.40 చొప్పున రెండేళ్ల పాటు సాయం అందిస్తున్నాం. కొబ్బరి పునరుద్ధరణ పథకం కింద కాపు తగ్గిన, వయసు మళ్లిన ముదర తోటలకు, పురుగు, తెగుళ్ల బారిన పడిన తోటలను పునరుద్ధరించడానికి హెక్టారుకు రూ.53,500 సహాయం అందించేందుకు వీలుంది. రైతుల తోటల్లో సమగ్ర సస్యరక్షణ, సమగ్ర ఎరువుల యాజమాన్యం చేపట్టి తోటల దిగుబడి, నాణ్యత మెరుగుకు, అంతర పంటల సాగుకు హెక్టారుకు రూ.17,500 రెండేళ్ల పాటు అందిస్తున్నాం. కొబ్బరిలో అంతరపంటగా నాణ్యమైన అంటు జీడి మామిడి మొక్కలను రైతులకు విస్తరణ పథకం కింద సరఫరా చేస్తున్నాం. వీటికి పెట్టుబడి రాయితీ కూడా ఇస్తున్నాం.

? కొబ్బరి మొక్కల సరఫరా ఎలా సాగుతోంది?

ఉద్దానం ప్రాంతంలోని రైతులతో పాటు జిల్లా రైతులు, ఇతర జిల్లాల రైతులకు నాణ్యమైన తూర్పు కోస్తా పొడుగు రకం కొబ్బరి మొక్కలు సరఫరాకు బారువలో కొబ్బరి నారుమడి క్షేత్రం ఏర్పాటు చేశాం. ఈ నారుమడి క్షేత్రంలో మొక్కలు ఉత్పత్తి చేసి రైతులకు రాయితీపై అందజేస్తున్నాం. ఇప్పటి వరకు 3,50 లక్షల మొక్కలు సరఫరా చేశాం. 2017-18లో లక్ష మొక్కలు, 2018-19లో 1.50 లక్షలు, 2019-20లో లక్ష మొక్కలు పంపిణీ చేశాం. బారువ నారుమడి క్షేత్రం కొబ్బరి మొక్కలకు రాష్ట్రంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది.

? తెగుళ్ల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో కొబ్బరి పంట ప్రధానంగా సాగు చేస్తున్న ఉద్దానం ప్రాంత ఏడు మండలాల్లో ఏటా కొబ్బరి రైతాంగానికి చీడపీడలు తప్పడం లేదు. సాగులో ఎప్పటికప్పుడు మెళకువలు రైతులకు తెలియజేస్తున్నాం. తుపాను అనంతరం చీడపీడలు ఆశించడం వల్ల రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. ప్రధానంగా కొమ్ము పురుగు, ఎర్ర ముక్కు పురుగు, సర్పిలాకార తెల్లదోమ ఎక్కువగా బాధిస్తున్నాయి. వీటికి సంబంధించి సమగ్ర సస్యరక్షణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచిస్తున్నాం.

నిరసన తెలుపుతున్న ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు

పాలస్తీనాపై దాడులను ఖండించాలి

పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఈశ్వరమ్మ

ప్రజాశక్తి- పలాస

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని ఖండించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యూ) జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్ గాజాపై చేస్తున్న వరస బాంబుదాడుల్లో పాలస్తీనీయులు పసిపిల్లలు, మహిళలు వేలాది మంది మరణిస్తున్నారని, దాడులను ఖండిస్తూ పిఒడబ్ల్యు జాతీయ కార్యవర్గం ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం పలాస సూదికొండలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాలస్తీనాకు సంఘీభావం ప్రకటిస్తూ ఇజ్రాయిల్ దుర్మార్గం విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆమె కోరారు. ఒకప్పుడు దేశానికి స్థానం లేని ఇజ్రాయిల్ పాలస్తీనా పక్కన ఆశ్రయం పొంది పాలస్తీనీయులకే దేశం లేకుండా, మాతృభూమి లేకుండా నిరాశ్రయులుగా చేసి దేశం నుండి తరిమి వేయడాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. అమెరికా అండదండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధం ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యు జిల్లా నాయకులు కె.సుహాసిని, మామిడి మహాలక్ష్మి, పంప సరస్వతి, పి.కుమారి, బృందావతి, రామలక్ష్మి, సుగుణ, గీత పాల్గొన్నారు.

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో బూర్జపాడు గ్రామంలో శ్రీ సరస్వతి పూజా పంచరాత్రి మహోత్సవాలు సందర్భంగా ఆదివారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 20 జట్లు పాల్గొన్నాయి. మొదటి రోజు ఇచ్ఛాపురం, కేశుపురం, ధర్మపురం, డొంకూరు జట్లు విజయం సాధించాయి. మ్యాచ్ రిఫరీలుగా ఎస్.చిరంజీవి, వజీర్ అహ్మద్, ఎస్.కె.మదీన, ఎన్.వినోద్, ఎస్.కె.సహజన్ వ్యవహరించారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభాస్ అభిమానుల రక్తదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సినీ నటుడు ప్రభాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని రాధాకృష్ణ ఫంక్షన్ హాల్లో ఆయన అభిమానులు ఆదివారం రక్తదానం చేశారు. ముందుగా ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినీ అభిమానులు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. రక్తదానం వల్ల ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ సూర్య, సందీప్, టాటూ సభ్యులు అప్పలనాయుడు, శేఖర్, ఆర్టికాన్ సాయి, యశ్వంత్, గోపాల్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న అభిమానులు

విద్యుత్ కష్టాలు తీరేదెప్పుడో?

- నిత్యం విద్యుత్ సరఫరాకు అంతరాయం
- లైన్‌మెన్‌ను నియమించని వైనం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అల్లెన పంచాయతీకి విద్యుత్ సమస్య తీవ్రంగా వేధిస్తుంది. మండలంలో ఈ పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకు లైన్‌మేన్ లేకపోవడంతో తరుచూ విద్యుత్ సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ పంచాయతీ పరిధిలో సుమారు 80 వరకు వ్యవసాయ పంపు సెట్లు ఉన్నాయని రైతులు తెలిపారు. వీటికి విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తితే పరిష్కరించే నాథుడే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి తీవ్ర ఇబ్బందులు ఉన్నప్పటికీ పరిష్కరించడంలో జాప్యం ఎదురవుతుందని పంచాయతీ ప్రజలు వాపోతున్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తరువాత ప్రతి సచివాలయ పరిధిలో పంచాయతీకి సంబంధించి రెగ్యులర్ లైన్‌మేన్‌ను నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించినా మారుమూల పంచాయతీ కావడంతో అధికారులు దృష్టి సారించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దశాబ్దాలు కాలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా... విద్యుత్ శాఖ అధికారులు డిప్యుటేషన్‌పై లైన్‌మేన్‌ను ఏర్పాటు చేయడం, కొంతకాలం వారు పనిచేసిన తర్వాత బదిలీపై వెళ్లిపోవడంతో మళ్లీ సమస్య వేధిస్తుంది. ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన ఇన్‌ఛార్జి లైన్‌మేన్‌ను జిల్లాల మార్పిడిలో విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లిపోయారని అధికారులు సమాధానం ఇస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం అల్లెన గ్రామదేవత ఆలయం నుండి శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారని అయితే వాటికి సంబంధించిన వైర్లు క్రిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించడమే కాకుండా పూర్తిస్థాయి లైన్‌మేన్‌ను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అల్లెన సచివాలయం

రైతుల సమస్యలు పరిష్కరించాలి

వర్షాభావ పరిస్థితుల వల్ల దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మరోవైపు విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రెగ్యులర్ లైన్‌మేన్ లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా రెగ్యులర్ లైన్‌మేన్‌ను నియమించాలి.

\- వి.సీతారాం బాబునాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు

అధికారులు చోద్యం చూస్తున్నారు

అల్లెన పంచాయతీకి సంబంధించి ఎదురవుతున్న సమస్యలను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అల్లెన పంచాయతీ సంబంధించి రెగ్యులర్ లైన్‌మేన్‌ను నియమించేందుకు చర్యలు తీసుకోవాలి.

\- జడ్డు దివ్య, సర్పంచ్, అల్లెన

సమస్యను పరిష్కరిస్తా

అల్లెన పంచాయతీకి లైన్‌మేన్ లేకపోవడం వాస్తవమే. అయితే పంచాయతీకి సంబంధించి విద్యుత్ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం. అలాగే త్వరలోనే లైన్‌మేన్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- అప్పన్న, విద్యుత్‌శాఖ ఎఇ

టిడిపిలోకి పలువురి చేరిక

ప్రజాశక్తి- పలాస

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయలేకపోయినా రాష్ట్రమంత్రి సీదిరి అప్పలరాజు తన నివాసం ముందు మూడంతస్తులతో ప్రగతి భవనం పూర్తి చేసుకున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఎద్దేవా చేశారు. పలాస టిడిపి కార్యాలయంలో ఆదివారం పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలో ఉన్న నాలుగో వార్డు నుంచి సుమారు 60 మంది వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వారికి గౌత శిరీష టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అప్పలరాజు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఒక పర్యాయం పూర్తికాకముందే నెమలకొండ, సూది కొండ, నల్లబుడ్లూరు ఇలా నియోజకవర్గం పరిధిలో ఉన్న కొండలను మాయం చేశారని ఆరోపించారు. మూడేళ్లు కావస్తున్న నేటికీ కెటి రోడ్డు విస్తరణపనులు పూర్తి చేయలేకపోయారన్నారు. రైల్వే వంతెన పనులను పూర్తి చేస్తామని చెప్పి రెండోసారి శంకుస్థాపన చేశారని, రైల్వే వంతెన పనులు పూర్తి చేయలేకపోయారని అన్నారు. అట్టహాసంగా రైతుబజార్ ఏర్పాటు కోసం శంకుస్థాపన చేసి గాలికొదిలేసారన్నారు. సమావేశంలో మాజీ మంత్రి గౌతు శివాజీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస : కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శిరీష

బూర్జ : మండలంలోని అల్లెనకు చెందిన వైసిపి మండలం మహిళా అధ్యక్షులు భారతీ తన అనుచరులతో ఆదివారం టిడిపిలోకి చేశారు. తుడ్డలి అంపిలి గణపతిరావు ఆధ్వర్యాన శ్రీకాకుళంలోని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో చేరారు. వీరికి టిడిపి జెండా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో వైకుంఠరావు, టి.సాయిబాబు ఉన్నారు.

పలుచోట్ల 'బాబుతో నేను'

పోస్టర్లను అందజేస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తూ... ప్రజలను, ప్రతిపక్షాలను చిత్రహింసలకు గురి చేస్తున్న ప్రభుత్వాన్ని సాగనంపాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని వెన్నెలవలస, చిగురువలస గ్రామాల్లో ఆదివారం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వెన్నెలవలసలో గిరిజనులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి పాలనలోనే గిరిజనులకు సముచిత స్థానం కల్పించిందని అన్నారు. అనంతరం ఇంటింటికీ పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ, అంబళ్ల రాంబాబు, లావేటి పూర్ణ, కె.సూర్యనారాయణ, టి.వి.రమణ, ఎస్.గోవిందరావు, గుర్రాల చినబాబు, కొమనాపల్లి రవికుమార్, బాన్న వెంకటరమణ, బి.ఉమ, ఎస్.రాజారావు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని తుంగపేటలో చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిఎన్‌టియు జిల్లా అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి గాడు నారాయణరావు, సర్పంచ్ పప్పల వేణుగోపాలం ఆధ్వర్యాన బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, అరాచక విధానాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూన తేజేశ్వరరావు, కూన బాలకృష్ణ, పారంనాయుడు, కృష్ణవేణి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పొందూరు : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

పెన్షనర్లను విస్మరించిన ప్రభుత్వం

ఆమదాలవలస : పెన్షనర్లను ప్రభుత్వం విస్మరిస్తుందని ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 3.64 శాతం డిఎను పెంచుతూ ఉద్యోగులకు జిఒను జులై 21న విడుదల చేసిందని, కానీ, పెన్షనర్లకు డియర్ నెస్ రిలీఫ్ జీవోను ఇవ్వకుండా వారిని విస్మరించిందని అన్నారు. గతంలో డిఎ పెంచుతూ ఉద్యోగులతో సమానంగా పెన్షనర్ల డిఆర్ జిఒ విడుదల చేసేదని, కానీ, ప్రస్తుతం విభజించు, పాలించు అన్న పద్ధతిలో పెన్షనర్లకు డిఆర్‌ను ఇవ్వకుండా వారి మనోభావాలతో ఈ ప్రభుత్వం చెలగాటమాడుతుందని అన్నారు. పెన్షనర్లకూ పెంచిన డిఎతో పాటు డిఆర్ జిఒను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆక్రమణలకు గురైన మార్కెట్

ఆక్రమణలు తొలగించరూ...

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ టెక్కలి చిన్నబజార్‌లో చేపల మార్కెట్‌కు వెళ్లే రోడ్డులో ఆక్రమణలు తొలగించి కాలువ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చేపల మార్కెట్‌కు ఆదివారం, మంగళవారం ట్రాఫిక్ జామ్‌తో పూర్తిగా ఇబ్బందులు పడుతున్నామని పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత టిడిపి ప్రభుత్వం కాలువ నిర్మాణం చేపట్టకుండా కాలువపై నుండి సిసి రోడ్డుపైకి నాలుగు అడుగులు ముందుకు వచ్చి షాపింగ్ కాంప్లెక్స్ పేరుతో అక్రమ నిర్మాణం చేపట్టారు. అప్పుడు ప్రతి పక్షంలో ఉన్న వార్డు సభ్యులు వద్దని నిలదీసినప్పటికీ అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం, కొంతమంది టిడిపి నాయకులు స్వార్థం కోసం ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. అయితే నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయింది. ఆది, మంగళవారాలు ఈ రోడ్డు మార్గం పూర్తిగా ట్రాఫిక్ జామ్‌తోపాటు వర్షం పడితే రోడ్డుపైకి మురుగునీరు ప్రవహిస్తుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణం తొలగించి కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

చిత్రపటం అందుకుంటున్న గోవిందరావు

కొత్తమ్మతల్లి సందర్శన

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లిని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోవిందరావు కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవాదయశాఖ ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకృష్ణ, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బోయిన మాధవి, కృష్ణారావులు స్వాగతం పలికారు. ఆలయ ముఖమండపంలో పురోహితులు ఆలయ సంప్రదాయం ప్రకారం చిత్రపటాన్ని అందజేశారు.

తీర్మానం చేస్తున్న అధికారులు, నాయకులు

ధర్మవరంగా నామకరణానికి తీర్మానం

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ ఉప్పరపేటను ధర్మవరం అనే కొత్త పేరు పెట్టుకున్నారు. స్థానికులు చేసిన విన్నపానికి కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు గ్రామంలో రెవెన్యూ అధికారి బమ్మిడి విశ్వనాథం, సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపిటిసి బగాది దివాకర్, గ్రామస్తులు కలసి ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఈ ఊరు పేరును గ్రామస్తులందరి అంగీకారంతో ధర్మవరంగా నామకరణ చేయటానికి తీర్మానించారు. ఈ గ్రామసభలో ఉప సర్పంచ్ మొగిలి రామారావు, సదునుపల్లి శ్రీనివాసరావు, చెన్నంశెట్టి చిన్నయ్య, చెన్నంశెట్టి వెంకటరావు, మొగిలి నారాయణరావు, జలతారు రాములు, సదునుపల్లి చిన్నవాడు పాల్గొన్నారు.

పత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

పాకివలసలో 'కార్డాన్‌సెర్చ్'

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు పంచాయతీ పాకివలసలో ఆదివారం టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి నేతృత్వంలో పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో అపరిచిత వ్యక్తులు సంచరించినా, అనుమానస్పదంగా ఎవరైన కనిపించినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. అలాగే రికార్డులు లేని 11 ద్విచక్రవాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ప్రతి వ్యక్తీ తమ ద్విచక్రవాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని, లేకుంటే ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ మహ్మద్‌అలీ పాల్గొన్నారు.

ఎలుగు సంచారం

సంతబొమ్మాళి : మండలంలో కొన్ని రోజులుగా ఎలుగు తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది. శనివారం రాత్రి సంతబొమ్మాళి ఎస్‌సి వీధి, హైస్కూల్, అంగన్వాడీ కేంద్రాల్లో సంచరించింది. అంగన్వాడీ కేంద్రంలోని ఆయిల్ ప్యాకెట్లు, హైస్కూల్లో చెక్కీల ప్యాకెట్లు, నాలుగు అరటి చెట్లు ఎలుగు ధ్వంసం చేసింది. అటవీశాఖ అధికారులు వెంటనే ఎలుగుని బంధించాలని స్థానికులు కోరుతున్నారు.

బహుమతులను అందజేస్తున్న రాంబాబు

ముగిసిన శిక్షణా శిబిరం

లావేరు : మండలంలోని మురపాక శాఖా గ్రంథాలయంలో దసరా సెలవులు సందర్భంగా వారం రోజులు పాటు గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ రకాలుగా ఇచ్చిన శిక్షణ తరగతులు విజయంతంగా ముగుసినట్లు గ్రంథాలయాధికారి టి.రాంబాబు తెలిపారు. ఆదివారం విద్యార్థులకు ఇంతవరకు ఏర్పాటుచేసిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ శిక్షణలో తాము ఎంతో విజ్ఞానాన్ని సంపాధించుకున్నామని విద్యార్థులు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

నందిగాం : మండలంలోని సుభద్రాపురం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. సుభద్రాపురానికి చెందిన పి.జయరాం రోడ్డు దాటుతుండగా పలాస వైపు నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రుడిని స్థానికులు టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

టెక్కలి రూరల్ : మండలంలోని సవరకిల్లి సమీపంలో ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.21,150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు అన్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. పేకాట శిబిరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టణంలో ట్రాఫిక్‌జామ్

నిలిచిన వాహనాలు

టెక్కలి రూరల్ : టెక్కలి అంబేద్కర్ కూడలి సమీపంలో ఆదివారం రాత్రి పూండి-టెక్కలి ఆర్‌టిసి బస్సు రోడ్డు మధ్యలో మరమ్మతుల గురై నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పూండి నుంచి టెక్కలి వస్తుండగా బస్సు గేర్ బాక్స్ మరమ్మతుకు గురైంది.

ఘనంగా కొమరం భీమ్ జయంతి

నందిగాం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సంఘ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మన్యం వీరుడు కొమరంభీమ్ 132వ జయంతి వేడుకలను బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నగరంలోని మహాత్మా జ్యోతిరావుపూలే పార్కులో నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టా చంద్రపతిరావు మాట్లాడుతూ కొమురం భీమ్ దేశ విముక్తి కోసం, అసఫ్ జహి రాజవాసానికి వ్యతిరేకంగా పోరాడిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజనోద్యమ నాయకుడన్నారు. గిరిజన గోండు తెగకు చెందిన కొమరం చిన్నూ, సోంబాయి దంపతులకు సంకేపల్లి గ్రామంలో 1901లో జన్మించారని గుర్తు చేశారు. ఆయన నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొరిల్లా శైలిలో పోరాడారన్నారు. నిజాం నవాబ్ సైనికులకు వ్యతిరేకంగా ఆయుధాలు చేతపట్టి పశువుల కాపర్లపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా జల్ జంగల్ జమీన్ అన్న నినాదంతో ఉద్యమించి వీరమరణం పొందాడన్నారు. ఈ కార్యక్రమంలో బాడాన దేవభూషణరావు, రౌతు శంకరావు, గుత్తు చిన్నారావు, అడపాక రాంబాబు, మరుల శంకరావు, పసగాడ రామకృష్ణ, తాళ్లూరి విజయ లక్ష్మణ్, పిట్టా భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని హర్షవాడ పంచాయతీ సవరలింగపురంలో నిర్వహించిన కొమరం భీం జయంతి వేడుకలో ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు, ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు పెద్దింటి నేపాల్, పెద్దింటి దొంగయ్య, పెద్దింటి ఫాల్గుణరావు, మాధవరావు, పెద్దింటి చంద్రరావు, పెద్దింటి ధనుంజయ, పెద్దింటి ప్రవీణ్ పాల్గొన్నారు.

భారీ వాహనాలతో అవస్థలు

ప్రజాశక్తి- బూర్జ

భారీ వాహనాల రాకపోకలతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విజయనగరం జిల్లా పారాది గ్రామం వద్ద వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో భారీ వాహనాల రాకపోకులకు అడ్డుకట్ట వేయడంతో భారీ వాహనాలను బూర్జ మీదగా పాలకొండ ప్రధాన రహదారిపై అనునిత్యం భారీ వాహనాలు రావడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. 24 టైర్లు కలిగిన వాహనాలు రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పాటు ప్రమాదాలు సంభవించిన సంఘటనలు ఉన్నాయి. ఈ భారీ వాహనాలు రాకపోకల వలన రహదారి మొత్తం గోతులుమయంగా మారి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇప్పటికే ఈ రెండు నెలల్లో సుమారు పదుల సంఖ్యలో ప్రమాదాలు సంభ వించి మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అయి నప్పటికీ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహ రిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని రామన్నపేట, అప్పలపేట, పెద్దపేట, కొండపేట, కొల్లివలస తదితర గ్రామాల వద్ద రహదారి మొత్తం పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ద్విచక్ర వాహనా లు బోల్తా పడిన సందర్భాలు న్నాయని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించి లేదా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై వెళ్తున్న భారీ వాహనం

పార్కును పరిశీలిస్తున్న జీవితేశ్వరరావు

ముత్యాలమ్మ కోనేరును అభివృద్ధి చేయాలి

పలాస: పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలు సేద తీరేందుకు ఏకైక పార్క్ ముత్యాలమ్మ కోనేరని, దానిని అభివృద్ధి చేయాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావు అన్నారు. పలాస ముత్యాలమ్మ కోనేరును ఆదివారం వాకర్స్ క్లబ్ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ ముందు వరకు పార్కులో నడిచేందుకు వందలాది మంది వచ్చేవారిని, వారి అందరి భాగస్వామ్యంతో వాకర్స్ క్లబ్ పెట్టి సభ్యుల సొంత నిధులతో పార్కును అభివృద్ధి చేసుకున్నామని గుర్తు చేశారు. దీనిలో భాగంగా సిమెంట్, గ్రానైట్ బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు చుట్టూ ఔషధ మొక్కలు పెంచామని తెలిపారు. వృద్ధులు నడిచేందుకు ప్రత్యేక గడ్డి రహదారి ఏర్పాటు చేశారని తెలిపారు. వైసిపి పాలనలో అభివృద్ధి పేరుట మున్సిపల్ నిధులు మొదటి విడతగా రూ.44 లక్షలు, రెండో విడతగా రూ.33 లక్షలు బిల్లులు చేయించుకొని ముత్యాలమ్మ కోనేరు పార్కును నామ రూపాలు లేకుండా విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. నిధులు దుర్వినియోగంపై సమాచార హక్కుచట్టం ద్వారా వివరాలు సేకరించి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. తక్షణమే మున్సిపల్ పాలక వర్గం, అధికారులు చొరవ చూపి పార్కు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వాకర్స్ క్లబ్ సభ్యులే నిధులు సేకరించి పార్కును అభివృద్ధి చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేంద్ర పండిట్, కోశాధికారి బల్ల చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు సత్యానందం, సభ్యులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న ప్రకాష్

ప్రజాశక్తి- కవిటి

ఈ నెల 26 నుంచి ఇచ్ఛాపురంలో జరగబోయే సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేయాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ కోరారు. ఈ మేరకు బొరివంక గ్రామంలో ఆదివారం సాయంత్రం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొని, తమతో పాటు కార్యకర్తలు, స్థానికులు పాల్గొనేలా చూడాలని సూచించారు. మండలం నుంచి అత్యధిక మంది ఈ కార్యక్రమంలో పాల్గొని సిఎం జగన్మోహన్ రెడ్డికి తమ మద్దతు తెలపాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, బొరివంక సర్పంచ్ బెందాలం శ్రీరాం ప్రసాద్, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిటిసిలు పూడి నీలాచలం, దుద్ది సతీష్, వైసిపి లీగల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు, బల్లెడ జయప్రకాష్, పిన్నింటి జయరాం పాల్గొన్నారు.

కృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తులసీ వరప్రసాద్

తులసీ వరప్రసాద్ పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో చాపర గ్రామంలో ఆదివారం వైసిపి జిల్లా కోశాధికారి లోతుగడ్డ తులసీ వరప్రసాద్ పర్యటించారు. గ్రామానికి చెందిన పాడి కృష్ణారావు భార్య ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈయన వెంట రట్టిని సర్పంచ్ శ్యామల బాబు, ఎఎంసి డైరెక్టర్ గండేటి చిన్నారావు, జానకిరామ్, శ్రీనివాసరావు ఉన్నారు.

గణపతి ఆలయ స్థలం కబ్జాకు యత్నం!

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ భూ కబ్జాలకు చిరునామాగా మారింది. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టే చందంగా కొంత మంది అధికార పార్టీ చోటా నాయకులు ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు తేడా లేకుండా ఆక్రమించుకుంటురన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ కోవలోకే వస్తుంది మరో భూ ఆక్రమణ. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అన్నపూర్ణ థియేటర్ సమీపంలో ఉన్న గణపతి ఆలయం పక్కన ప్రైవేటు స్థలాన్ని కొంత మంది అభివృద్ధి పేరుతో ఆక్రమించేందుకు నిర్మాణాలు చేపట్టారు. దీంతో స్థలాన్ని నిర్మాణం చేయడం వివాదమైంది. దీంతో స్థల యజమాని, వైశ్య సంఘం నాయకులు నిలదీశారు. ఆక్రమణ విషయమై నియోజకవర్గ అధికార పార్టీ కీలకనేత దృష్టికి తీసుకువెళ్లారు. స్థల ఆక్రమణపై కీలకనేత మౌనం వహించడంతో ఫిర్యాదు చేసేందుకు వెళ్ళిన స్థల యజమాని, వైశ్య సంఘం నాయకులు అసహనంతో వెనుదిరిగారు. అక్కడితో ఆగకుండా మున్సిపాలిటీ కీలకనేత దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన స్పందించి వారికి మద్దతు పలికి తన అధికార మున్సిపాలిటీ బృందానికి పంపించి తొలగించేందుకు సిద్ధమయ్యారు. దీంతో భూ ఆక్రమణ వివాదం రసవత్తరంగా మారింది. ఇదిలా ఉండగా ఆ ప్రాంతంలో కాశీబుగ్గకు చెందిన ప్రముఖ వైద్యులు నూతనంగా ఆస్పత్రి నిర్మాణానికి స్థలం కొనుగోలు చేశారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నారని విషయం తెలుసుకున్న అధికార పార్టీ చోటా నాయకులు ముందుస్తుగా ఆ స్థలంపై కన్నేశారు. ఆ ప్రాంతంలో నిర్మాణం చేపడితే భవిష్యత్తులో స్థలంతో పాటు నిర్మాణానికి విలువ పెరుగుతుందనే ఉద్దేశంతో ఈ ఆక్రమణకు పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే అక్రమ నిర్మాణ పనులు నిలుస్తుందా...? మున్సిపల్ అధికారులు తొలగిస్తారా...? లేదా.. ? లేకపోతే అక్రమ నిర్మాణ పనులు యధావిధిగా కొనసాగుతాయా...? వేచి చూడాల్సి ఉంది.

ఆలయం పక్కన నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం